క్లుప్తంగా

ముగిసిన జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు



బిజినేపల్లి: మండలంలోని ఆనందగిరి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి వృషభరాజుల బండలాగుడు పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. 5 రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి మొదటి బహుమతి రూ.80,000 పొందగా, నంద్యాల జిల్లాకు చెందిన పులిచిన్న ఓబుల్‌రెడ్డి ద్వితీయ బహుమతి, గురునాథ్ మూడో బహుమతి పొందారు. పోటీల్లో గెలుపొందిన వారికి తెలంగాణ రాష్ట్ర డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి నగదు ప్రోత్సాహకం అందించారు. పోటీల్లో బిజినేపల్లి సర్పంచ్ బాలీశ్వర్, తిరుపతయ్య, ఎంపీటీసీ కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి, వెంకటస్వామి, మిద్దె రాములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అమూల్యమైనవి



కల్వకుర్తి రూరల్: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువుల సంతలో కల్వకుర్తి క్లబ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆకలితో ఇబ్బందులు పడుతున్న వారికి ఆకలి తీర్చేందుకు దేశంలో చాలా ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేద ప్రజల ఆకలిని తీరుస్తున్నామన్నారు. లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో క్లబ్ ఏర్పాటయిన అతితక్కువ కాలంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంతకు వచ్చే రైతులకు భోజనం అందించి వారి ఆకలి తీరుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటేష్, కిషన్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో రక్తదాన శిబిరం



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శరత్‌చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. రక్తదానంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవచ్చన్నారు. సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పి.అరవింద్, శివశంకర్, సంతోష్, నరేష్, అభి, బ్లడ్‌బ్యాంకు వైద్యులు రోహిత్‌కుమార్ తదితరులున్నారు.

చల్లపల్లిలో నూతన కమిటీ ఎన్నిక

వెల్దండ: మండల పరిధిలోని చల్లపల్లిలో ఆదివారం మాదిగ ఐక్య వేదిక నూతన కమిటీని ఐక్యవేదిక పర్యవేక్షకులు మీసాల అంజయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్, ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా జెలెందర్, కార్యదర్శులుగా రామస్వామి, బసవరాజు, గౌరవ అధ్యక్షులుగా వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా వెంకటయ్య, అంజయ్య, కోశాధికారిగా మహేష్‌లతో పాటు మరో 10 మందితో కమిటీని ఎన్నుకున్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంజయ్య, పుల్లయ్య, కొమ్ము అంజయ్య, కిష్టాల్, అశోక్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చారకొండ: మండలంలోని మర్రిపల్లికి చెందిన తెమ్మెటి అంజనమ్మ అనారోగ్యానికి గురైంది. దీంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో మంజూరైన రూ.30 వేల చెక్కును ఆదివారం సర్పంచ్ నరేష్ నాయక్ గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని సర్పంచ్ నరేష్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శివ భక్తుల శ్రీశైలం బాట

ప్రారంభమైన పాదయాత్ర



దోమలపెంటలో భాగ్యనగర్ శివదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం

అచ్చంపేట: శ్రీశైలం మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను, ఇరుముడి సమర్పించేందుకు శివభక్తులు తరలి వెళ్తున్నారు. నల్లమల కొండలు, గుట్టలు శివ నామస్మరణతో మార్మోగుతున్నాయి. వనపర్తి–అచ్చంపేట, మహబూబ్‌నగర్– అచ్చంపేట స్టేట్ హైవే, నల్గొండ, మిర్యాలగూడాతో పాటు హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారి వెంట శివభక్తుల పాదయాత్ర ప్రారంభమైంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుండటంతో నల్లమల ప్రాంతంలో రద్దీ పెరిగింది. ఈ నెల 18న మహాశివరాత్రి వేడుకలు తిలకించేందుకు రాష్ట్రం నుంచి భక్తులు మల్లన్న దర్శనం కోసం పాదయాత్రగా వెళ్తున్నారు. మదిలో శివయ్యను తలుస్తూ.. సుదూర ప్రాంతాల నుంచి అలుపెరుగని కాలినడక సాగిస్తున్నారు. ఏ చెట్లు, గుట్టలు, కాలిబాటలు చూసిన శివభక్తులే దర్శనమిస్తున్నారు. ఎంతో నిష్టతో 41 రోజుల పాటు శివదీక్ష బూని భక్తి పారవశ్యంతో ముందుకు సాగుతున్నారు.

15న శివభక్తుల ఇరుముడి

లింగాల: మాలధారణ చేసి దీక్ష చేపట్టిన శివభక్తుల ఇరుముడి ఈ నెల 15న నిర్వహించనున్నట్లు గురుస్వాములు కోనేటి వెంకటస్వామి, రాములు, తిరుపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల కేంద్రంలోని కోదండరామాలయం ఆవరణలో ఇరుముడి కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి..

పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో శివభక్తులు పడిపూజ కార్యక్రమంలో ఆదివారం పీఆర్ జగదీశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. ప్రజలంతా భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు రాము యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్మయ్య, ఖాజ, మురళీధర్‌రెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో ఆదివారం శివభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల వెంట ర్యాలీ నిర్వహించి ప్రత్యేక భజనలు ఏర్పాటు చేసి అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు.

అన్నదాన కేంద్రం ప్రారంభం

దోమలపెంట(అచ్చంపేట): భాగ్యనగర్ శివదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో దోమలపెంట అటవీ చెక్‌పోస్టు సమీపంలో అన్నదానం కేంద్రం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్ర ద్వార శ్రీశైలానికి వస్తున్న శివభక్తులు దోమలపెంటలోకి ప్రవేశించిన వెంటనే అన్నదాన కేంద్రం ఉండటం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. స్థానిక సర్పంచ్ శారద, మహేష్ పాల్గొని స్వాములకు భోజనాలు వడ్డించారు. జ్ఞానేశ్వర్, కిరణ్, నిర్వహణ కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో శివ భక్తులకు అన్నదానం



బలాన్‌పల్లిలో పూజలు నిర్వహిస్తున్న శివభక్తులు

వృద్ధురాలి శ్రమదానం

దోమలపెంట(అచ్చంపేట): దోమలపెంటలోని గోవిందరాజులు నగర్‌లో నివసిస్తున్న డెబ్బై ఏళ్ల ముస్లిం వృద్ధురాలు పాదయాత్ర ద్వార శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాముల సంక్షేమార్థం ఆదివారం శ్రమదానం చేశారు. మహాశివ రాత్రి పురస్కరించుకుని శివ దీక్షబూనిన శివభక్తులు రోజు వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్ర ద్వార దోమలపెంట మీదుగా శ్రీశైలం వెళ్తారు. వీరందరు దోమలపెంట నుంచి ఈగలపెంటకు అడ్డదారిలో వెళ్తారు. అడ్డదారి గోవిందరాజులు నగర్ నుంచే ప్రారంభమవుతుంది. ఇక్కడే నివాసం ఉంటున్న నాసర్‌బీ(70) శివభక్తుల సంక్షేమార్థం అడ్డదారిలోని ముళ్లకంపలను తొలగిస్తూ.. ఆ దారి మొత్తం శుభ్రంగా ఊడ్చి సిద్ధం చేస్తున్నారు. ఆమెకు మరో యువతి, ఇద్దరు చిన్నారులు సాయం చేశారు.



ముళ్లకంపలు తొలగిస్తూ శ్రమదానం చేస్తున్న ముస్లిం వృద్ధురాలు

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ రాములు

కల్వకుర్తి టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వంగూరు మండలం రంగాపూర్‌కు చెందిన పవన్ కుటుంబ సభ్యులను ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో మృతుడికి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ప్రభుత్వ విప్ బాలరాజు స్థానిక పోలీసులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రభుత్వపరంగా, పార్టీ తరఫున కుటుంబాన్ని ఆదుకునేలా చూస్తామని ఇద్దరు నేతలు మృతుని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిరసన చేపట్టారు. పోలీసులు వారికి నచ్చజెప్పడంతో వెంటనే నిరసన విరమించి వెనుదిరిగారు. ఆస్పత్రికి పెద్దఎత్తున గ్రామస్తులు, బంధువులు చేరుకోవడంతో పోలీసులు బందోబస్తు చేపట్టారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కుటుంసభ్యులకు అప్పగించారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటా..

లింగాల: మృతుడు ఉమ్మడి వల్లభాపూర్ మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటస్వామిగౌడ్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎంపీ రాములు అన్నారు. ఆదివారం మృతుని స్వగ్రామమైన మండల పరిధిలోని రాంపూర్‌లో నిర్వహించిన దశదిన కర్మలో ఎంపీ పాల్గొని నివాళి అర్పించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి మరణించడం దురదృష్టకరమని అన్నారు. ఆయన కుమారుడు మాచర్ల సుధీర్‌గౌడ్ తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేసి నేడు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు భరత్ ప్రసాద్, మాకం తిర్పతయ్య, మనోహర్, కమలాకర్ రావు, సుధాకర్‌రావు, నాగయ్యగౌడ్, తులసిరాం, రవిశంకర్ తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ఫొటోగ్రాఫర్‌కు నివాళి



కొల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కల్వకుర్తి నియోజకవర్గం, రంగాపూర్‌కి చెందిన ఫొటోగ్రాఫర్ పవన్‌కు కొల్లాపూర్‌లో ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకుడు కట్టా శ్రీనివాసులు కోరారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారి చెల్లించాలన్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమ బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సంతోష్, సంపంగి నాగరాజు, అంజత్, హుస్సేన్, బాలస్వామి తదితరులున్నారు.


లీకేజీ సరిచేయండి



తాడూరు: మండల కేంద్రంలోని రెండో వార్డులో పైపులైన్ లీకేజీ ఏర్పడి దుర్వాసన వస్తుంది. రెండు నెలల నుంచి తరచూ లీకేజీ అవుతున్నా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదరువుతున్నాయని వార్డువాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తరచూ వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డంతా నీరు వ్యాపించి రాకపోకలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు నీరంతా బురదమయమై దుర్వాసన వస్తుందని, అధికారులు పరిశీలించి లీకేజి సరిచేయించాలని కోరారు.

ఘనంగా మల్లెలమ్మ ఉత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలో మల్లెలమ్మ దేవత ఉత్సవాలను ఆదివారం మహేంద్ర(మ్యాదరి) కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈదమ్మ గుడి సమీపంలోని మల్లెలమ్మ దేవతకు మహేంద్ర కులస్తులు సంప్రదాయబద్ధంగా బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లు బలిఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కులస్తులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఏఎస్పీ మురళి, నాయకులు పిన్నంశెట్టి బాలు, శేఖర్, ప్యారసాని మురళి, వెంకటస్వామి, సుధాకర్, పులి శ్రీను, భరత్, వెంకటయ్య, బాలయ్య, సత్యం, లక్ష్మి, సుజాత, చంద్రకళ పాల్గొన్నారు.



మనోధైర్యంతో పరీక్షలకు హాజరుకావాలి



అచ్చంపేటలో టీస్ట్ టాలెంట్ టెస్టు పేపరు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



కొల్లాపూర్‌లో ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అచ్చంపేట: బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ టాలెంట్ టెస్టు పేపర్‌ను విడుదల చేసిన పరీక్షల్లో 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టెన్త్ విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా మనోధైర్యంతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. టాలెంట్ టెస్టు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు ఇలాంటి టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు లక్ష్మణ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు, యూటీఎఫ్ నాయకులు లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, లోకేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

కొల్లాపూర్: ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొల్లాపూర్‌లోని సత్యసాయి విద్యావిహార్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ, విద్యావిహార్ పాఠశాల ప్రిన్సిపాల్ భగవంతు సంయుక్తంగా పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలపై భయాందోళన పోగొట్టేందుకు ఇటువంటి పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, చిన్న, బాలాజీ, కోటేష్, శ్రీవల్లి, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఏదీ?



కనెక్షన్ లేని ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న కాలనీవాసులు

తెలకపల్లి: ప్రజలకు కరెంట్‌ను సరఫరా చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని సీఎల్ఆర్ కళాశాల సమీపంలో 8 నెలల కిందట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం దిమ్మె నిర్మించి తరువాత ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేశారు. దానికి సంబంధించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వాటికి వైర్లు బిగించారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మాత్రం కనెక్షన్ ఇవ్వకపోవడంతో విద్యుత్ సరఫరా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎన్నిమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ దిమ్మెను నిర్మించి నెలలు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వకపోవడంతో విద్యుత్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తెలకపల్లిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు పెరిగాయని, విద్యుత్ అవసరాలు పెరిగాయని, కానీ ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా లేకపోవడంతో ఉన్న వాటిపై ఎక్కువ లోడు పడి విద్యుత్ బిల్లులతో పాటు జీఎస్టీ కూడా ప్రతి నెల వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ వక్త బస్వరాజు పాటిల్

కల్వకుర్తి టౌన్: ప్రస్తుత నవీకరణ సమాజానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు అవసరమని ప్రముఖ వక్త, భారతీయ విద్యా ఉత్సవ్ సభ్యుడు బస్వరాజు పాటిల్ అన్నారు. మూడు రోజులుగా పట్టణంలోని అక్షరవనంలో 'విద్యార్థులకు ఎలా బోధిస్తే వారు అవగతం చేసుకుంటారనే' అంశాలపై భారతీయ విద్యాఉత్సవ్ పేరుతో నిర్వహించిన వర్క్‌షాపులు ఆదివారంతో ముగిశాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో విద్యావ్యవస్థపై అధ్యయనం చేయడానికి ఇలాంటి చాలా వర్క్‌షాపులకు హాజరై చాలా విషయాలను తెలుసుకున్నానని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు తరగతి పాఠాల కన్నా ఇతర అంశాలతో పాటుగా తరగతులను నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారన్నారు. వాటికి అనుగుణంగా విద్యార్థులకు పాఠాలను ఎలా బోధించాలనే విషయాలపై ఉపాధ్యాయులు ప్రిపేర్ అయి ఉండాలని అన్నారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా ఆరుగురు వక్తలు క్రియేటివ్ టీచింగ్‌తో పాటుగా పలు ఇతర అంశాలపై పాఠశాలలో అవలంబించాల్సిన పద్ధతులపై వక్తలు ప్రసంగించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా దయానంద సరస్వతి జయంతి



దయానంద్ సరస్వతి జయంతి వేడుకల్లో పాల్గొన్న డీఏవీ విద్యార్థులు, ప్రిన్సిపాల్

దోమలపెంట(అచ్చంపేట): టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో ఈగలపెంటలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో ఆదివారం మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దయానంద సరస్వతి ఆర్య సమాజ్‌ను స్థాపించి దేశానికి ఆయన చేసిన సేవలను తెలియజేశారు. ఆయన ఆశయాలను సాకారం చేయడం కోసం 1886లో మహాత్మా హంసరాజ్ డీఏవి(దయానంద్ ఆంగ్లో వేదిక)పాఠశాలలను స్థాపించారన్నారు. ఇప్పటి వరకు వెయ్యికి పైగా డీఏవీ పాఠశాలలు ప్రపంచ వ్యాప్తంగా నెలకుని ఉన్నాయన్నారు. నాలుగు మిలియన్ పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం రెండు మిలియన్ విద్యార్థులు, లక్షకు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు చెప్పారు. డీఏవి కాలేజ్ మేనేజ్‌మెంట్ ట్రస్టును స్థాపించి తద్వార మహనీయుల గురించి సమాజానికి తెలియస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఆర్యసమాజ్ నియమాలను వల్లెవేస్తున్నట్లు తెలియజేశారు. నేటి నుంచి వచ్చే ఏడాది 12–02–2024వ తేదీ వరకు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా దయానంద్ సరస్వతి సేవల కార్యక్రమాలను డీఏవీ మేనేజ్‌మెంట్ చేపట్టనున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు ఎత్తివేయండి



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు



అమ్రాబాద్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట: జిల్లాలో వ్యవసాయానికి విధిస్తున్న కరెంట్ కోతలను వెంటనే ఎత్తివేసి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు అధికమయ్యాయని, ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా 24 గంటల విద్యుత్ రావడం లేదని, పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, ఈ పరిస్థితి మారకపోతే రైతాంగం ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. వరి, వేరుశనగ ఇతర పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు దేశ్యా నాయక్, శంకర్, అశోక్, దశరథం, బాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

అమ్రాబాద్: మండలంలో విద్యుత్ కోతలకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామని చెప్పడం ఎంతో బాధకరమని అన్నారు. ఎంపీపీ శ్రీనివాసులు, బుచ్చయ్య, హరినారాయణగౌడ్, కేశవులు, రాజ్‌గోపాల్, రహీమ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న క్లాస్‌మేట్ సభ్యులు

కోడేరు: 2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తోటిస్నేహితులు కోడేరుకు చెందిన షమీమాబేగం భర్త గతంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో పూర్వ విద్యార్థులు అంతా కలిసి కుటుంబానికి రూ.86,890 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కుందేళ్ల వెంకటస్వామి, ఈశ్వర్, విజయ్, ఎం.డి ఖాద్రి, కృష్ణ, స్వామి, నాగేష్, మహేశ్వరి, దానయ్య, తీగలపల్లి బి.భాస్కర్, పుల్లయ్య పాల్గొన్నారు.

నెమ్మదిగా 'మన ఊరు- మన బడి' పనులు



ఏర్పాటు చేసిన నల్లాలు



నిర్మాణ దశలో ఉన్న మూత్రశాలలు

తాడూరు: మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాల 'మన ఊరు- మన బడి' పథకంలో వివిధ పాఠశాల ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేశారు. మే 7న రూ.33.83 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. మూత్రశాలల నిర్మాణం, ప్రహరీ, విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి ప్రత్యేక ఏర్పాట్లతో పాటు పాఠశాలలో విద్యుత్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. పనులు పూర్తి కావడానికి రోజులు గడిచినా పూర్తి కావడంలేదు. వివిధ సమస్యల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని అధికారులు తెలియజేస్తున్నారు.